ప్రజాశక్తి
సోమవారం 2 డిసెంబర్ 2024
5
శ్రీ సత్యసాయి



విడపనకల్ వద్ద రోడ్డు ప్రమాదం

ముగ్గురు మృతి, ఒకరికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

పూర్తి వివరాలు మెయిన్‌పేజీలో..

సమస్యల వలయంలో గిరిజన గురుకుల పాఠశాల



మౌలిక వసతులు కరువు
ఒకే గదిలో చదువు, తిండి, నిద్ర
ఇరుకు గదులతో విద్యార్థుల అవస్థలు



వసతి గృహంలో నిర్వహిస్తున్న గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల భవనం

ప్రజాశక్తి-పెనుకొండ

అసలే ఇరుకైన గదులు..అందులోనే చదువు.. అక్కడే పడక..అక్కడే తిండి. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో వర్ణనాతీతంగా మారిన విద్యార్థినుల ఘోస ఇది. చదువులు పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు నాంది. గిరిజన గురుకుల పాఠశాల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నట్లు పాలకులు పదే పదే చెబుతున్నా అదే స్థాయిలో పాఠశాల్లో సమస్యలు వెక్కిరిస్తున్నాయి. పెనుకొండలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలికలు) ఇందుకు ఉదాహరణగా నిలుస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వం బాలికా విద్యను ప్రోత్సహిస్తూ వారికోసం ప్రత్యేకంగా గురుకులాలను ఏర్పాటు చేసింది. అక్కడ మౌలిక వసతులను కల్పించి ఆహ్లాదకర వాతావరణంలో నాణ్యమైన విద్యాబోధనకు ఏర్పాట్లు చేసింది. అయితే అందుకు తగ్గట్టుగా వసతుల కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

వసతిగృహంలోనే గురుకులం

పెనుకొండ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో 5 వతరగతి నుంచి 10వ తరగతి వరకు 153 మంది విద్యార్థులు చదువుతున్నారు. గురుకుల పాఠశాలకు సొంత భవనం లేదు. గతంలో ఎస్టీ,ఎస్సీ బాలికల వసతిగృహంగా ఉన్న భవనంలోనే గురుకుల పాఠశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈభవనంలో 8 గదులున్నాయి. అందులో ఒకటి ప్రిన్సిపల్ గదిగా ఉపయోగించుకున్నారు. మిగిలిన 7 గదుల్లోనే విద్యార్థినులు ఉంటున్నారు.

చదువు, తిండి, నిద్రకి ఒకే చోటు..

విద్యార్థినులకు సరిపడా గదులు లేవు. అదే గదిలో చదువుకోవాలి, తినాలి, అక్కడే నిద్రపోవాలి. భోజనం చేయాలంటే ఆరుబయట ఎండైన సరే అక్కడే తినాలి. విద్యార్థుల దుస్తులు, పుస్తకాలు పెట్టుకునే ట్రంకు పెట్టెలు కూడా ఆగదుల్లోనే పెట్టుకోవాలి. 153 మంది విద్యార్థినులకు ఈ గదులు సరిపోవడంలేదు. ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతూ చదువుకుంటున్నారు.

ఇరుకు గదులతో అవస్థలు..

గురుకులంలో ఉన్న 7 గదులు చిన్నవిగా ఉన్నాయి. అందులో 153 మంది విద్యార్థినుల ఉండటానికి అవస్థలు పడుతున్నారు. పదిమంది ఉంటేనే ఇరుకుగా ఉండే గదుల్లో ఒక్కొగదిలో 22 మంది ఉంటున్నారు. విద్యార్థులు ఉపయోగించే పెట్టెలు, ఇతరాత్ర సామాగ్రిని పెట్టుకోడానికి పాఠశాల పైన రేకుల షెడ్డు నిర్మించారు. విద్యార్థులకు సంబంధించిన పెట్టెలు, పుస్తకాలు, దుస్తులు వంటి వస్తువులు అన్ని అక్కడే పెట్టుకోవాలి. ఒక పెట్టెపై మరోక పెట్టె పెట్టుకుని విద్యార్థులు సర్దుకుపోతున్నారు. ఉతికిన బట్టలు సైతం ఈ షెడ్డులోనే అరబెట్టుకోవాలి.

మౌలిక వసతులు కరువు

వసతిగృహంలో ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు లేవు. ఇరుకు గదుల్లో చదువు, తిండి, నిద్రపోవాలి. విద్యార్థులకు సరిపడా స్నానపు గదులు, మరుగుదొడ్లు లేవు. స్నానం చేయలంటే విద్యార్థులు పోటీపడాల్సిన దుస్థితి నెలకొంది. ఇక విద్యార్థులు ఆటస్థలం లేదు. పాఠశాల కాంపౌండ్‌లోనే ఇరుకైన స్థలంలో విద్యార్థినులు ఆటలు ఆడుకుంటున్నారు.

భూమి కేటాయించి ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగని నిర్మాణం..

గిరిజన గురుకుల బాలికల పాఠశాలకు పట్టణ సమీపంలోని షీఫాం సమీపంలో 2018లో 6 ఎకరాల భూమిని రెవిన్యూ అధికారులు కేటాయించారు. అప్పటి టిడిపి ప్రభుత్వం గురుకుల పాఠశాల నిర్మాణం చేసేందుకు నిధులు సైతం మంజూరు చేసింది. భూమి కేటాయింపులు ఆలస్యం కావడం, 2019 సార్వత్రిక ఎన్నికలు రావడంతో గురుకుల పాఠశాల నిర్మాణం పనులు మొదలు కాలేదు. అనంతరం వచ్చిన వైసిపి ప్రభుత్వం గిరిజన గురుకుల పాఠశాల నిర్మాణం ఊసే ఎత్తలేదు. దీంతో విద్యార్థులు ఇరుకు గదుల్లో చదువులు కోనసాగించాల్సి వస్తోంది. గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందని చెబుతున్నప్పటికీ కార్యరూపం దాల్చడంలేదు.

నూతన భవనం నిర్మాణం చేపట్టాలి



గురుకుల పాఠశాల నిర్మాణానికి కేటాయించిన భూమిలో నూతన భవన నిర్మాణం చేపట్టాలి. విద్యార్థులు ఇరుకు గదుల్లో చదువుకోవడం ఇబ్బందిగా ఉంటోంది. మౌలిక వసతులు లేని పాత వసతిగృహంలో పాఠశాల నిర్వహించడం బాధాకరం. స్థానిక మంత్రి సవిత గిరిజన గురుకుల పాఠశాల అభివృద్ధిపై దృష్టి సారించాలి.

హరిలాల్‌నాయక్,
గిరిజన జాతి హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు



పాఠశాల ఆవరణంలోనే ఆడుకుంటున్న విద్యార్థినులు



గిరిజన గురుకుల పాఠశాలకు కేటాయించిన భూమి

మున్సిపల్ ఛైర్మన్‌కు కేటాయించని ఛాంబర్

మరమ్మతుల పేరుతో గదికి తాళం
ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైసిపీ కౌన్సిలర్లు
అధికారుల తీరుపై విమర్శల వెల్లువ

ప్రజాశక్తి-హిందూపురం


హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ గా ఉన్న ఇంద్రజ ఈ ఏడాది ఆగస్టు నెలలో తన పదవికి రాజీనామా చేశారు. దీంతో అప్పటి నుంచి ఖాళీగా ఉన్న చైర్మన్ పదవికి వైస్ చైర్మన్ గా ఉన్న బలరామిరెడ్డిని ఎంపిక చేస్తూ గత నెల మున్సిపల్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఉత్తర్వులు అందిన పక్షం రోజుల తర్వాత మున్సిపల్ అధికారులు ఛైర్మన్ బలరామిరెడ్డికి బాధ్యతలను అప్పగించారు. బాధ్యతలను అయితే అప్పగించారేగాని ఆయనకు ఛాంబర్‌ను మాత్రం ఇంతవరకు కేటాయించలేదు. దీంతో వైసిపి కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు నాగేంద్రబాబు, రోషన్ అలీ ఇతర కౌన్సిలర్లు చైర్మన్‌కు కేటాయించాల్సిన ఛాంబర్ ఎందుకు కేటాయించలేదని అధికారులను నిలదీశారు. అయినప్పటికీ మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులతో పాటు అధికారులు సరైన సమాధానం మాత్రం చెప్పలేదు. చైర్మన్ ఛాంబర్ మరమ్మతుల కారణంగా కేటాయించలేదని, మరమ్మతులు పూర్తిచేసి ఛాంబర్ కేటాయింపు చేస్తామని అంటున్నారు. అయితే ఈ ఏడాది ఆగస్టు వరకు బాగున్న ఛైర్మెన్ ఛాంబర్ మరమ్మతుకు ఎలా వచ్చిందో అర్థం కావడం లేదని కొంతమంది వైసీపీ కౌన్సిలర్లు అంటున్నారు. హిందూపురం పురపాలక సంఘంలో 38 మంది కౌన్సిలర్లలో కేవలం 6 స్థానాల్లో గెలిచిన టిడిపి ఫిరాయింపు అస్త్రాన్ని ఉపయోగించి 15 మంది కౌన్సిలర్లను టిడిపిలో చేర్చుకుంది. దీంతో పూర్తి బలంతో చైర్మన్ పీఠం దక్కించుకోవాలని టిడిపి యత్నించింది. త్వరలో చైర్మన్ ఎంపికకు నోటిఫికేషన్ వస్తుందని ఊహించి క్యాంపు రాజకీయాలను సైతం చేపట్టి, కౌన్సిలర్లను హైదరాబాద్‌కు తరలించారు. అయితే నోటిపికేషన్ రాకపోవడంతో పాటు ఎవరు ఊహించని విధంగా వైస్ చైర్మన్ గా ఉన్న బలరామిరెడ్డిని డెలిగేట్ చైర్మన్ గా ఎంపిక చేస్తూ మున్సిపల్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిని జీర్ణించుకోలేని టిడిపి నాయకులు అధికారులను అడ్డం పెట్టుకుని ఇప్పటి వరకు చైర్మన్‌కు ఛాంబర్‌ను కేటాయించకుండా అడ్డు తగులుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాల్సిన అధికార యంత్రాంగం అధికార పార్టీ నేతల అడుగులకు మడుగులోత్తకుండా చైర్మన్‌గా ఎంపిక చేసిన వారికి వారి పదవీకాలం ఉన్నంత వరకు పురపాలక చట్టం మేరకు సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.



కౌన్సిల్ హాల్‌లోని ఛైర్మన్ గదికి గదికి తాళం వేసిన దృశ్యం

ప్రజలపై విద్యుత్ భారాలు తగదు

వైసిపి వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పొగాకు రామచంద్ర



ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల మోత మోగిస్తోందని వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర విమర్శించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఆరు నెలల కాలంలోనే రెండుసార్లు విద్యుత్ ఛార్జీల మోత మోగించిందన్నారు. కూటమి నాయకులు ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు పెంచమని ఊరువాడ డప్పు కొట్టి ప్రచారం చేశారన్నారు. ఇప్పుడు ఏకంగా ఆరు నెలల కాలంలోనే రెండుసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి 15,485.36 కోట్ల రూపాయలను ప్రజలపై భారం మోపారని విమర్శించారు. విద్యుత్ ఛార్జీలే కాకుండా నిత్యావసర సరుకులు కూడా అందని ఎత్తులో ఉన్నాయన్నారు. ప్రభుత్వం సంపద సృష్టిస్తుందని యువకులు నిరుద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం అమలు చేయకపోగా, సంపద సృష్టి పేరుతో సామాన్యుల నడ్డి విరుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసరాల పెరుగుదల కారణంగా సామాన్యులకు పండగ వస్తుందంటే భయపడే పరిస్థితి నేడు రాష్ట్రంలో నెలకొందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు అనుగుణంగానే నడుచుకొని, విద్యుత్ చార్జీల పెంపు విషయంలో కూటమి ప్రభుత్వం పునరాలోచనలకు రావాలన్నారు. కూటమి ప్రభుత్వం విధానాలను,వైఫల్యాలను ఎండగడతామన్నారు,

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

కలెక్టర్ టిఎస్ చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఎయిడ్స్ అంటువ్యాధి కాదని దీనికి చికిత్స ఉందని ఈ వ్యాధిపై అవగాహన అవసరమని కలెక్టర్ టిఎస్ చేతన్ పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థలు, కళాశాలల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల భయాందోళనలు అవసరం లేదన్నారు. ఈ వ్యాధి ఒక సాధారణ, బిపి, షుగర్ లాంటిదేనని దీనికి చికిత్స ఉందని అన్నారు. ఎయిడ్స్ వ్యాధి బాధితుల పట్ల ప్రేమతో వ్యవహరించాలన్నారు. ర్యాలీ ఆర్టీసీ బస్టాండ్ వరకు చేరుకొని అక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు ఇచ్చారు. డిఎంహెచ్ఒ మంజువాణి మాట్లాడుతూ ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. జిల్లా ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డాక్టర్ తిప్పయ్య మాట్లాడుతూ 15 రోజులపాటు 8 హెచ్ఐవి పై అవగాహన చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ మెప్మా, వైద్య ఆరోగ్య సిబ్బందితోపాటు జన జాగృతిస్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు డిపి బలరాం, ప్రాజెక్టు మేనేజర్లు ఈశ్వరయ్య, ఆంజనేయులు, శ్రీనివాసులు, పాజిటివ్ నెట్‌వర్క్ రామాంజనేయులు, అశోక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : ఎయిడ్స్ నిర్మూలన సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత అని సీనియర్ సివిల్ జడ్జి మేడపాటి శ్రీధర్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా ప్రభుత్వ అసుపత్రి సమావేశం హాల్‌లో హిందూ, ముస్లీం ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉమర్ ఫారూఖ్ ఖాన్ అధ్యక్షతన ఎయిడ్స్ బాధితులను ఆసరానిద్దాం-వసుదైక కుటుంబం నిర్మిద్దాం అనే నినాదం పై న్యాయసేవా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, వన్ టౌన్ సిఐ రాజగోపాల్ నాయుడు, టూటౌన్ సిఐ అబ్దుల్ కరీం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇందాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఎయిడ్స్‌ను నిర్మూలించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వాలు అనేక చర్యలను చేపట్టడం జరుగుతుందన్నారు. 2025 గణాంకాలు ప్రకారం జిల్లాలో 425 మంది బాధితులు ఉన్నారన్నారు. ప్రజలలో అవగాహన తీసుకోస్తే దీనిని నియంత్రించవచ్చు అన్నారు. చైతన్య గంగిరెడ్డి, డాక్టర్ చరణ్‌లు మాట్లాడుతు వివక్షత చూపకుండా ఎయిడ్స్ బాధితులతో మంచి సంబంధాలు కలిగి ఉండాలన్నారు. అనంతరం 50 మంది ఎయిడ్స్ బాధితులకు దాతలు చీరలు, ప్యాంట్ షర్టులు,కంబళ్ళు, ష్వెటర్లు, విద్యార్థులకు నోట్ బుక్ లు. పండ్లు పౌష్టికాహారం, భోజనం అందించారు. ఇదే సందర్భంగా న్యాయమూర్తి చేతుల మీదుగా దాతలు ఏసీ నాగరాజు, మంచాల మారుతి, జే. వెంకటస్వామి, నరేంద్ర, షబ్బీర్, సాదిక్, అజ్మతుల్లా ఖాన్, ఉబెదుల్లా హుస్సేన్, హాజీ నాసిర్, అజ్మతుల్లా ఖాన్ లకు మానవత మూర్తి పురస్కారం అందించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీసీ కౌన్సిలర్ విమల, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

పోలీసులపై వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఆగ్రహం

పెనుకొండ : మండలంలోని మావటూరు గ్రామం లో ఆదివారం దాయాదుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. మావటూరుకు చెందిన చాకలి అంజనప్ప, చాకలి సుబ్బయ్య కుమారులు ముకుంద, శ్రీనివాసులు దాయాదులు. గ్రామ సమీపంలో చాకలి సుబ్బయ్యకు పదెకరాల పొలం ఉంది. ఈ పొలంలో శ్రీనివాసులు పని చేసుకుం టుండగా చాకలి అంజనప్ప కుమా రుడు ముకుంద, అతని తల్లి రామలక్ష్మమ్మ వచ్చి పొలానికి అడ్డుగా గట్లు వేస్తే మా పొలానికి నీరు ఎలా వస్తుందని ప్రశ్నించారు. దీంతో శ్రీనివాసులు పారతో దాడి చేయడంతో ముకుందకు తీవ్ర గాయాల య్యాయి. తల్లి, కుమారుడు ఫిర్యాదు మేరకు పోలీసు లు కేసు నమోదు చేసి శ్రీనివాసులును అరెస్టు చేసి రిమాండ్ కు పంపించారు. కాగా ఈ విషయంపై వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, తన అనుచరులతో కలిసి ఆదివారం పెనుకొండ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి హల్‌చల్ చేశారు. రాజీ అవుతామని చెప్పినా పోలీసులు కేసు నమోదు చేయడం ఎంటని మండిపడ్డారు. రాజకీయ ఒత్తిళ్లతోనే పోలీసుల కేసు నమోదు చేశారని, ఈ విషయంలో ఎస్ఐపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. బాధితులు ఫిర్యాదు మేరకు శ్రీనివాసులుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

గిరిజనులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కె.మోహన్‌రామ్



ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు దాటుతున్నా ఇంకా కొన్ని మారుమూల గిరిజన గ్రామాలు సరైన మౌలిక సదుపాయాలకు నోచుకోలేదు. ప్రధానంగా రహదారులు, తాగునీరు, విద్యుత్, రవాణా సౌకర్యం తదితర మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న గిరిజన తండాలు, ఎరుకుల, యానాది తదితర వెనుకబడిన గిరిజన ఆవాసాలు ఉన్నాయి. గిరిజన ఆవాసాల గ్రామాల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికంగా కూడా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా గిరిజనులు వారి పిల్లలు పథకాలను అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న పథకాలు గురించి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె. మోహన్ రామ్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు. గిరిజనుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కె. మోహన్ రామ్ పేర్కొన్నారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని గిరిజన ఆవాస గ్రామాలున్నాయి.? అందులో అత్యంత వెనుకబడినవి ఎన్ని.?

జవాబు : జిల్లా వ్యాప్తంగా 450 గిరిజన ఆవాస గ్రామాలు ఉన్నాయి. ఇందులో ఏడు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేనట్లుగా గుర్తించాం. రహదారులు, నీటి సదుపాయాలు, కల్పించడానికి తగు చర్యలు తీసుకుంటున్నాము. ఈ ఏడు ఆవాస గ్రామాలు ముదిగుబ్బ మండలం బత్తలపల్లితో పాటు మడకశిర, కదిరి నియోజకవర్గాలలో ఉన్నాయి. వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వానికి నివేదిక పంపాం.

ప్ర : గిరిజనులకు కల్పిస్తున్న రుణ సదుపాయాలేవి ?

జ : గిరిజనుల అభివృద్ధి కోసం 60 యూనిట్లు గుర్తించాం. వాటిలో గొర్రెలు, పాడి పశువులు, ట్రాక్టర్లు, బొలెరా వాహనాలు. వీటిని అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం. గిరిజన పాఠశాలల అభివృద్ధికి తగిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించాం.

ప్ర : గిరిజన విద్యార్థులు ఎంతమంది ఉన్నారు.? వారికి ప్రత్యేక పాఠశాలలు ఎన్ని ఉన్నాయి.?

జ : జిల్లాలో దాదాపు 1900 మంది గిరిజన విద్యార్థులు ఉన్నారు. వారికోసం ప్రత్యేక పాఠశాలలు ఉన్నాయి. ఒక ఆశ్రమ పాఠశాల, ఆరు గురుకుల పాఠశాలలు, ఐదు వసతిగృహాలు ఉన్నాయి. వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతోంది. స్కాలర్‌షిప్‌ల మంజూరుకు ప్రతిపాదనలు పంపాం.

ప్ర : సమగ్ర గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వపరంగా తీసుకుంటున్న చర్యలు ఏమిటి.?

జ: సమగ్ర గిరిజన అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం జిల్లాలో 3 గ్రామాలను ఎంపిక చేసింది. మారుమూల గ్రామాలైన వాటిలో పూర్తిగా మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం. సోమందేపల్లి మండలం నాగినాయుని చెరువు తండా, తనకల్లు మండలంలో ముండ్ల వారి పల్లి, గాండ్లపెంట మండలంలో తుమ్మల బైలు గ్రామాలు ఎంపికయ్యాయి. వీటిని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడమే ధ్యేయం. అందుకు కేంద్ర ప్రభుత్వం తగిన నిధులు మంజూరు చేయనుంది. వాటిలో గృహ నిర్మాణం, తాగునీటి సౌకర్యం, రహదారులు, విద్య, వైద్య సౌకర్యాలు ఇలా 17 రకాల అభివృద్ధి పనులు, మౌలిక సౌకర్యాలు కల్పిస్తాం. వీటిపై ఆయా శాఖల ద్వారా పర్యవేక్షణ ఉంటుంది. పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో ఆదర్శ గ్రామాలుగా తీర్చించడం జరుగుతుంది.

ప్ర : మీశాఖలో సిబ్బంది కొరత ఉందా.? గిరిజనులకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి.?

జ : సిబ్బంది కొరత ఏమీ లేదు. అభివృద్ధి పనులు ఆయా శాఖల పర్యవేక్షణలో జరుగుతాయి. తమ శాఖ ఆయా గిరిజన గ్రామాల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతుంది. గతంతో పోల్చుకుంటే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి. మారుతున్న సమాజానికి అనుగుణంగా అవసరాలు కూడా పెరుగుతుంటాయి. గిరిజనులు తమ పిల్లలను బాగా చదివించుకోవాలి. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అందుకొని వాటిని సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధి చెందాలి.



జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కె. మోహన్ రామ్

అంగన్వాడీ వర్కర్లపై వేధింపులు ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

అంగన్వాడీ వర్కర్లపై ఐసిడిఎస్ అధికారుల వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ తెలిపారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెనుకొండ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని పెనుకొండ, రొద్దం మండలాల్లో ఐసిడిఎస్ అధికారుల వేధింపులతో అంగన్వాడీ వర్కర్లు మానసికంగా గురవుతున్నారన్నారు. కూరగాయల బిల్లులు సక్రమంగా చెల్లించడం లేదన్నారు. ఇకనైనా అంగన్వాడీ వర్కర్లపై వేధింపులు ఆపకపోతే ఐసి డిఎస్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి భావమ్మ, సెక్టార్ లీడర్లు సావిత్రమ్మ, లక్ష్మీదేవి, పద్మ, సరస్వతి, సుజాత, సుధామణి, తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 104 ఉద్యోగులు 16 ఏళ్లుగా అతి తక్కువ వేతనాలు తీసుకుంటూ ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. వారి సమస్యలను పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారి సమ్మెకు సిఐటియు సంపూర్ణంగా మద్దతు తెలుపుతుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, నాయకులు అజయ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు



ఎంఇఒ ఆంజనేయులు నాయక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఎంఇఒకు ఉపాధ్యాయుల సన్మానం

ప్రజాశక్తి-రొద్దం

కొన్నేళ్లుగా మండలంలో విశిష్ట సేవలు అందించి జిల్లా ఉత్తమ మండల విద్యాశాఖ అధికారిగా అవార్డు అందుకున్న ఎంఇఒ ఆంజనేయులు నాయక్‌ను ఆదివారం మండలంలోని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ ఆంజనేయులు ఇలాంటి అవార్డులు మరెన్నో పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు మారుతి, తేజ, రమేష్, గోకుల్, శ్రీనివాసులు, విద్యాజ్యోతి, మౌనిక పాల్గొన్నారు.

నేడు చేపల చెరువు వేలం

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని దేవరహట్టి గ్రామ పంచాయతీ పరిధిలోని పలారం గ్రామం చేపల చెరువును సోమవారం విస్తరణ అధికారి నాగరాజు నాయక్, సర్పంచి సతీష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు పంచాయతీకి ఎలాంటి బకాయిలు ఉండరాదని, రూ. 5వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. పంచాయతీ నిబంధనలకు లోబడి వేలం వేస్తామని తెలిపారు.

ఆడపిల్లలు ధైర్యంగా జీవించాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఆడపిల్లలు సమాజంలో ధైర్యంగా జీవించాలని పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు ససూచించారు. ఆయన ఆదివారం మండలంలోని పాపిరెడ్డిపల్లి సమీపంలో ఉన్న కెజిబివిని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు సమాజంలో సమస్యలకు భయపడకుండా ధైర్యంగా ఎదుర్కొంటూ జీవించాల న్నారు. మహిళా చట్టాలు అనేకం ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకో వాలన్నారు. మహిళా చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్‌కి వచ్చి తెలపాలన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్, తదితర విషయాల గురించి విద్యార్థినులకు తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఐ మురళి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతరు..

కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

స్థానిక ధర్మవరం రహదారిలో 384 సర్వే నెంబర్‌లో అక్రమంగా గృహ నిర్మాణాలు చేప ట్టారు. వైసిపి ప్రభుత్వం ఎన్నికల ముందు 23 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి ఇంటి పట్టా లు లేకుండానే రిజిస్ట్రేషన్ చేయించింది. ఈ విషయంపై టిడిపి నాయకుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు ఆయా వ్యక్తులను పిలిపించి పట్టాలు లేకుండా గృహ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదిలా ఉండగా ఆదివారం సెలవు కావడంతో అక్రమంగా ఇళ్ల పునా దులు, గోడల పనులు చేపట్టారు. ఈ విషయం తెలియడంతో విఆర్ఎలు, పోలీసులు అక్కడికి చేరుకుని నిర్మాణ పనులను ఆపివేయాలని సూచిం చారు. అయితే వారు వెళ్లిపోగానే వారు యథా విధిగా నిర్మాణ పనులు చేపట్టారు. ఈ విషయంపై తహశీల్దార్ నీలకంఠారెడ్డిని వివరణ కోరగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమిష్టి కృషి

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా ముందుకెళ్దామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని రోడ్లు భవనాల అతిథి గృహంలో ఆదివారం కదిరి శాఖ అధ్యక్షుడు షఫ్టిన్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను విన్నవిస్తే రాష్ట్ర అధ్యక్షులు కెఆర్.సూర్య నారాయణ దృష్టికి తీసుకెళ్లి, వాటిపై ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించ డానికి కృషి చేస్తారన్నారు. తాలూకా అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఆత్మారెడ్డి మాట్లాడుతూ సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన రామాంజనేయులును కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. జిల్లా అసోసి యేట్ ప్రెసిడెంట్ డా. నాగేంద్రనాయక్ ఎఎన్ఎంల సమస్యలను ఏకరువు పెట్టారు. సంఘం సభ్యులు సమస్యలను వివరించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి పి.రామాంజనేయులు, జిల్లా సంయుక్త కార్యదర్శులు గోపి నాయక్, రామచంద్రారెడ్డి, తాలూకా ఉపాధ్యక్షులు దేవ్లానాయక్, రామచంద్రా రెడ్డి, సుధాకర్, ఉపేంద్రరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాయసం హరిప్రసాద్, కోశాధికారి చిన్నయ్య శెట్టి, సంయుక్త కార్యదర్శులు రామ్ ప్రసాద్, ప్రసన్న కుమారి, షామీద, జయప్రకాష్, ముసల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

అవార్డు గ్రహీతకు ఎపిటిఎఫ్ సన్మానం

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఎపిటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎపిటిఎఫ్ పూర్వ రాష్ట్ర కౌన్సిలర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తరుగు చెన్న కృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన ఎపిటిఎఫ్ సంఘ సమావేశంలో ఆయన సేవలను కొనియాడారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్‌కుమార్ ప్రసంగిస్తూ చెన్న కృష్ణారెడ్డి ఉపాధ్యాయునిగా, ఉపాధ్యాయ ఉద్యమ నేతగా, సమాజ సేవకునిగా విద్యారంగం, సమాజం అభివృద్ధికి ఎంతో కృషి చేశార న్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు పివి.మాధవ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరు శ్రీనివాసులు, ఆర్.చంద్ర ప్రసంగిస్తూ చెన్న కృష్ణారెడ్డి సేవలను కొనియాడారు. సన్మాన గ్రహీత చెన్న కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ ప్రయాణాన్ని కొత్తచెరువులోనే ప్రారంభించానని, ఇక్కడే ఉద్యోగ విరమణ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రవీంద్రారెడ్డి, వెంకటనారాయణరెడ్డి, ఎల్.చంద్ర, సాయిశివ, జయరాం, రాజశేఖర్, హరిప్రసాద్, వెంకటనాయుడు, లక్ష్మీనారాయణ, భాస్కర్, సురేష్‌బాబు, నాగేంద్రప్రసాద్, ప్రభాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెన్నకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

దళితవాడ సమస్యలపై నేడు ధర్నా

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని మామిళ్లకుంట క్రాస్ దళితవాడలో సమస్యలపై సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొత్తచెరువు ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నట్లు వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, కోశాధికారి వెంకటేష్ తెలిపారు. వారు ఆదివారం మామిళ్లకుంట క్రాస్ దళితవాడలో పర్యటించారు. కాలనీలో మురుగునీరు తొలగిం చాలని, వీధిదీపాలు, కాలువలు ఏర్పాటు చేయా లని కోరుతూ గత నెల 23వ తేదీ కాలనీవాసులతో కలిసి ఎంపీడీవో నటరాజ్‌కి వినతిపత్రం అందజేసినా ఫలితం లేదన్నారు. ఆయా సమస్యలపై శనివారం సంఘం జిల్లా కోశాధికారి సాకే వెంకటేష్, కాలనీ వాసులు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని మండిపడ్డారు. దీంతో సోమ వారం వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న ఆధ్వర్యంలో కొత్తచెరువు ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడతా మని, అందులో కాలనీవాసులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు రమాదేవి, లక్ష్మక్క, వెంకటేశులు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న వ్యకాసం నేతలు

దుర్గమ్మ ఆలయంలో చోరీ

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని రాఘవంపల్లి గ్రామంలో వెలసిన దుర్గమ్మ ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆదివారం తెల్లవారుజామున ఆలయానికి వెళ్లిన అర్చకులు వెంకటరెడ్డి చోరీ జరిగినట్లు గుర్తించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. వివరాలు.. గ్రామంలో ఏడాది క్రితం నూతనంగా ఆలయం నిర్మించి దుర్గమ్మ విగ్రహాన్ని ప్రతిష్టాపన చేశారు. అమ్మవారికి 15 తులాలతో వెండి గొడుగు చేయించారు. అంతేకాకుండా ఇప్పటి వరకూ ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీని సైతం తెరవలేదు. ఇది గమనించిన దొంగలు గొడుగు, హుండీ ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆ గ్రామం వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ మంజు వాణి సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎయిడ్స్ బాధితులకు అందించే సేవలపై డిఎంహెచ్ఒ డాక్టర్ మంజువాణి, డాక్టర్ జ్యోత్స్న అవగాహన కల్పించారు. డాక్టర్ జ్యోత్స్న మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఎయిడ్స్ పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం జిల్లా ఎయిడ్స్ నివా రణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే పిహెచ్‌సికి ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వెంకట రమణ, చంద్రకళ, పిహెచ్‌సి సిబ్బంది నగేష్, లలితకుమారి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుకొండ : ఎయిడ్స్ అంటువ్యాధి కాదని నివారణతోనే ఎయిడ్స్ నియంత్రణ సాధ్యమని కౌన్సిలర్ శివజ్యోతి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అంబేద్కర్ సర్కిల్ మీదుగ ఎన్టీఆర్ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 'సరైన మార్గంలో వెళ్దాం.. నా ఆరోగ్యం, నా హక్కు' అని నినా దాలు చేశారు. వ్యాధి లక్షణాలు, అపోహలు, జాగ్రత్తలు, మందులు, తదితర అంశాల ను వివరించారు. కార్యక్రమంలో వైద్యులు సౌమ్య, ఆయేషా, జన జాగృతి ప్రతినిధి శశికళ, ఆసుపత్రి సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గాండ్లపెంట : పిహెచ్‌సి వైద్యాధికారిణి మహేశ్వరి, మారుతి, బాబాఫకృద్దీన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకూ ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. వారు మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన నిర్వహించి ఎయిడ్స్ మహమ్మారని పారదోలుదా అన్నారు. ప్రతిఒక్కరూ వెంటనే స్థానిక ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉపేంద్ర, విజయ్, పార్వతమ్మ, ఆశా వర్కర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పిహెచ్‌సికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డిఎంహెచ్ఒ మంజువాణి

ఓబుళదేవరచెరువు : ఎయిడ్స్ గురించి తెలుసుకొని ఆరోగ్యంగా జీవించడం ఒక్కటే మానవ మనుగడకు మార్గమని వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాష్ తెలిపారు. స్థానిక పిహెచ్‌సిలో ఎయిడ్స్‌పై వ్యాధి అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ పట్ల అవగాహన, ఆలోచన ఏర్పరచుకొని ఆరోగ్యవంతమైన, ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమందేపల్లి : స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్ హరికుమార్, డాక్టర్ ఓంకార్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ దినోత్సవం నిర్వహించారు. ముందుగా ఫ్లెక్సీలు, ప్లకార్డులు చేతపట్టి ఆసుపత్రి ఆవరణలో ప్రజలకు అవగాహన కలిగించారు. వారు మాట్లాడుతూ విచ్చలవిడి శృంగారమే ఎయిడ్స్‌కు కారణమని, హెచ్ఐవి సోకడం కంటే అవగాహన లేకపోవడమే ముప్పు అన్నారు. హెచ్ఐవిపై కలిసికట్టుగా పోరాడి హెచ్ఐవి రహిత సమాజంగా మార్చుకుందామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రవీంద్ర, రత్నమ్మ, వైద్య సిబ్బంది మధు, అనిల్, ప్రభాకర్, లలిత, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : డాక్టర్ రాజేంద్ర ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్లకార్డులు చేతపట్టి స్థానిక పిహెచ్‌సి నుంచి ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ వెంకటనారాయణ, టెక్నీషియన్ బషీర్, వైద్య సిబ్బంది నాగరాజు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న సిఐ ప్రభాకర్

రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

వాహనం నడిపే వారు వాహనాలకు సంబంధించిన రికార్డులతో పాటు రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్ తెలిపారు. తనిఖీలు నిర్వహించినప్పుడు వాహనాల రికార్డులు లేకపోతే జరిమానా విధిస్తామని తెలిపారు. ఆదివారం సాయంత్రం బత్తలపల్లి బైపాస్‌లో సిఐ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చు అన్నారు. రోడ్డు భద్రత మన అందరి బాధ్యత అన్నారు. జిల్లా ఎస్పీ రత్న ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి నిత్యం వాహనాలను తనిఖీ చేస్తుంటా మని, వాహన డ్రైవర్లకు అవగాహన కల్పిస్తూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఆదేశాలు ఇస్తున్నామన్నారు.

హెచ్ఎంపై సస్పెన్షన్ వేటు అన్యాయం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

విద్యార్థి కిడ్నాప్, హత్య కేసుకు సంబంధించి మడకశిర మండలంలోని ఆముదాలగుంది హైస్కూల్ హెచ్ఎంను విద్యాశాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేయడం అన్యాయమని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పివి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇంద్ర ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థి హత్యను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. స్కూల్ విరామ సమయంలో విద్యార్థి బంధువు పిలిచినందున ఇష్టపూర్వకంగా విద్యార్థి వెళ్లాడని, కుటుంబ గొడవలతో విద్యార్థిని హత్య చేశారన్నారు. దానికి హెచ్ఎంకు ఏం సంబంధం ఉందన్నారు. బయట గొడవలకు ఉపాధ్యాయులను శిక్షించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. వెంటనే హెచ్ఎంపై సస్పెన్షన్ ఎత్తివేసి పాఠశాల పరిసర ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-తలుపుల

మండలంలోని పెద్దన్నవారిపల్లి పంచాయతీ పరిధిలోని సంఘటివారిపల్లిలో ఆదివారం టిడిపి నాయకులు మేడా శంకర్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ గ్రామానికి వచ్చిన సమయంలో గ్రామస్తులు కోరడంతో ఆయన స్పందించి గ్రామానికి రోడ్డు మంజూరు చేయించారు. ఈ మేరకు రోడ్డు పనులను ప్రారంభించడంతో గ్రామస్తులు ఎమ్మెల్యే కందికుంటకు, మేడా శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఫిబ్రవరిలో ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ఫిబ్రవరిలో శ్రీకాకుళం జిల్లాలో అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవై ఎఫ్) 22వ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామని రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్ తెలిపారు. పట్టణంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజా అధ్యక్షతన ఎఐవైఎఫ్ జిల్లా ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. సంతోష్‌కుమార్ మాట్లాడుతూ పాలకవర్గ విధానాల వల్ల దేశ వ్యాప్తంగా నిరుద్యోగ సమస్య పెరిగిందన్నారు. అనంతరం పుట్టపర్తి మండల అధ్యక్షులుగా గోపినాయక్, ప్రధాన కార్యదర్శిగా పి.వినోద్ కుమార్, 9 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

24 గంటల్లోపే బాలుడి హత్య కేసు ఛేదింపు : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మడకశిర మండలంలో జరిగిన బాలుడి హత్య కేసును పోలీసులు 24 గంట ల్లోపే ఛేదించి నిందితులను అరెస్టు చేశారు. కేసు వివరాలను ఆదివారం ఎస్పీ వి.రత్న పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో వెల్లడించారు. మడకశిర మండలంలోని మరువపల్లి గ్రామానికి చెందిన పుష్పవతి భర్తతో విభేదాల కారణంగా కొన్నేళ్లుగా పుట్టినిల్లు అయిన మరువపల్లిలోనే కుమారునితో పాటు ఉంటోంది. బంధువైన అశోక్‌కుమార్ ఆమెను వేధింపులకు గురిచేసేవాడు. ఈ విషయాన్ని ఆమె ఇంట్లో వారికి తెలపడంతో గ్రామ పెద్దలు అశోక్ కుమార్‌ను మందలించగా అతడు పుష్పవతిపై కక్ష పెంచుకున్నాడు. పావగడకు చెందిన తనతో వివాహేతర సంబంధం కలిగి ఉన్న నాగలక్ష్మితో కలిసి పుష్పవతి కుమారుడు హత్యకు కుట్ర పన్నారు. నవంబర్ 28వ తేదీ ఆముదాల గొంది పాఠశాలకు వెళ్లి బాలుడికి మాయమాటలు చెప్పి ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి గొంతు కోసి హత్య చేసి ముళ్లపొదల్లో పడేశారు. ఫిర్యాదు చేయడంలో ఆలస్యం జరగడం వల్ల చిన్నారిని కాపాడలేకపోయా మన్నారు. రెండు రోజుల క్రితం పరిగి మండలంలో ఓ బాలిక అదృశ్యం కాగా సకాలంలో ఫిర్యాదు చేయడంతో గంటల వ్యవధిలోని క్షేమంగా కాపాడగలిగినట్లు ఎస్పీ తెలిపారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో కర్నాటక సరిహద్దు పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రోన్లతో నిఘాను కట్టుదిట్టం చేస్తామన్నారు. సమావేశంలో పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్‌బి బాలసుబ్రమణ్యంరెడ్డి, మడకశిర అర్బన్, రూరల్ సిఐలు రాగిరి రామయ్య, రాజ్‌కుమార్, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు



బాలుడు హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

తల్లిదండ్రుల చెంతకు సురక్షితంగా బాలిక

ప్రజాశక్తి-పరిగి

స్థానిక సీతారాంపురం కాలనీకి చెందిన రమాకాంత్ కూతురు వైష్ణవి జడ్పీ హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతోంది. తరచూ మొబైల్ చూస్తూ చదువును అశ్రద్ధ చేస్తుండడంతో తల్లిదండ్రులు మందలిం చారు. దీంతో దుస్తులతో పాటు కొన్ని వస్తువులు తీసుకొని బాలిక శనివారం అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు ఎస్పీ కార్యాలయానికి సమాచారం అందించడంతో స్పందించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐ రాఘవన్ సీతారాంపురం చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. పరిగి ఎస్ఐ రంగడుయాదవ్ సెలవులో ఉండగా రొద్దం ఎస్ఐ నరేంద్రకు బాలిక ఆచూకీ కనిపెట్టాలని ఆదేశించారు. దీంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు వైష్ణవి ఉన్న స్థలం గురించి తెలుసుకుని అక్కడికి వెళ్లి బాలికను రక్షించి పెనుగొండ సిఐ రాఘవన్ సమక్షంలో ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.



బాలికను కుటుంబ సభ్యులకు అప్పచెబుతున్న సిఐ, ఎస్ఐ

మేనమామ గొంతు కోసిన అల్లుడు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని రహమత్ పురంలో ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉన్న మేనమామ రఫీక్ గొంతును స్వయాన మేనల్లుడు చాంద్ బాషా కోసిన సంఘటన వెలుగు చూసింది. అందుకు సంబంధించిన వివరాల మేరకు... ఇంట్లో ఉన్న రఫీక్ వద్దకు మేనల్లుడు చాంద్ భాషా వచ్చి తన అవసరం నిమిత్తం రూ.400 డబ్బులు ఇవ్వాలని అడిగినాడు. అతను నిరాకరించడంతో ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈసందర్భంగా కత్తితో మామ గొంతు కోశాడు. ఈసందర్భంగా రఫీక్ గట్టిగా కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు వచ్చి చాంద్‌భాషను అడ్డుకున్నారు. గాయపడిన రఫీక్ ను స్థానికులు ఆటో సహాయంతో వైద్యం కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

లారీని ఢీకొన్న ఆటో.. నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం మణిసముద్రం గ్రామ సమీపంలో ఆదివారం లారీ, ఆటో ఢీకొన్న సంఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. గ్రామ సమీపంలో లారీ వెనక్కి వస్తుండగా దీనిని గమనించకుండా ఆటో డ్రైవర్ లారీని ఢీకొన్నాడు. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న పవన్ కళ్యాణ్, నందీష్, రవి, మారుతికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రత్యేక వాహనంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక రీచ్ సీజ్

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని రామాపురం వద్ద చిత్రావతి సమీపంలో ఉన్న ఇసుక రీచ్‌ను పోలీసులు గుర్తించి సీజ్ చేశారు. ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్ సోమశేఖర్ సిబ్బందితో కలిసి ఆదివారం సాయంత్రం ఎన్‌హెచ్-42పై వాహనాల తనిఖీ చేపట్టారు. అందిన సమాచారం మేరకు ఏక కాలంలో దాడులు చేసి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకు న్నారు. అలాగే రామా పురం గ్రామంలోని చిత్రావతి నది సమీపంలో నిల్వ ఉంచిన ఇసుక డంపులను గుర్తించి జెసిబిని స్వాధీనం చేసుకున్నారు. ఇసుక డంపులపై రెవెన్యూ అధికారు లకు సమాచారం ఇచ్చారు. టిప్పర్, జెసిబిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. దాడల్లో ఎఎస్ఐ విజ య్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఓబిలేసు, కానిస్టేబుల్ రామంజినేయులు, బాలకృష్ణ, గోపాల్ పాల్గొన్నారు.

ఎన్‌టిఎ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా పి.శివశంకర్

ప్రజాశక్తి-తనకల్లు

మండలంలోని దేవళంతండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న పి.శివ శంకర్ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా నియమితులైనట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో తనను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. తనకు అప్పజెప్పిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు. 117 జీవో రద్దు చేయడంతో పాటు ఉపాధ్యాయులకు వెంటనే డిఎ అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. తన ఎంపికకు సహకరించిన ఎన్‌టిఎ రాష్ట్ర అధ్యక్షులు వెంకటరావు, హైమారావుకు కృతజ్ఞతలు తెలిపారు.



ఎన్‌టిఎ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా పి.శివ శంకర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సజావుగా ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్షలు

ప్రజాశక్తి-మడకశర

పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎపి స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ పరీక్షలు సజావుగా జరిగాయి. ముఖ్య అతిథులుగా ఎంఇఒ భాస్కర్, హరేసముద్రం హైస్కూల్ హెచ్ఎం సునీత హాజరై ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ మోడల్ టెస్ట్ మీ భవిష్యత్తుకు చాలా ఉపయోగకరమన్నారు. విద్యార్థులకు పరీక్షలంటే భయం పోగొట్టడానికి ఇది మంచి వేదిక అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యాయులు దేవరాజు, లక్ష్మణమూర్తి, కరియన్న, నారాయణనాయక్, వెంకటేశులు, నాగేంద్రప్ప, మహేష్, కృష్ణ, శివ, శేషయ్య, శోభారాణి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కోసమే పరీక్షలు

అగళి : స్థానిక జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్షలు నిర్వహి ంచారు. మండలంలోని ఆయా సబ్జెక్టుల ఉపాధ్యా యులు, స్కూల్ అసిస్టెంట్స్ కలిసి ప్రశ్నపత్రాలు తయారుచేసి పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథి గా హెచ్ఎం వరదరాజులు హాజరై ప్రశ్నపత్రా లను విడుదల చేశారు. పరీక్ష రాయడానికి 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉత్తీర్ణులైన వారికి ప్రతి నెలా ప్రభుత్వం రూ. 1000 చొప్పున స్కాలర్‌షిప్ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్స్ వి.రంగన్న, ఎం.చిత్రలింగప్ప, బి.వేమ య్య, పవన్ కుమార్, కవిత, పార్థసారథి పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-రొద్దం

రాష్ట్ర ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు బిసి సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత సూచ నల మేరకు ఆదివారం మండలంలోని ఆర్.లోచర్ల గ్రామంలో నాయకులు టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలు వివరించి దాదాపు 330 సభ్యత్వాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వేమన్న, ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహమూర్తి, డీలర్ రామంజి, హనుమంతు, అంజనప్ప, నాగరాజు పాల్గొన్నారు.

సోమందేపల్లి : టిడిపి సభ్యత్వ నమోదులో మండలంలోని మాగేచెరువు పంచాయతీ నియోజక వర్గంలోనే అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. సర్పంచి నరసింహులు, మాజీ జడ్పిటిసి వెంకటరమణ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో సభ్యత్వ నమోదు చేయించారు. వారు ప్రజలు, టిడిపి సానుభూతి పరులకు సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రొద్దం మండలం లోచర్లలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న టిడిపి నాయకులు